క్లుప్తంగా

కల్యాణోత్సవం



పెనుగంచిప్రోలు: స్థానిక జమ్మిచెట్టు రామాలయంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణాన్ని బుధవారం వైభవంగా జరిపించారు. కల్యాణ పీటలపై విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు నంచర్ల గోపాచార్యులు దంపతులు కూర్చొన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

భక్తుల కోలాహలం



నందిగామరూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని దాములూరు కూడలిలో సందడి వాతావరణం నెలకొంది. నందిగామ నుంచి కూడలి ఆలయానికి వెళ్లే రహదారులు వాహనాలతో రద్దీగా మారాయి. వేలాది మంది భక్తులు తరలిరావడంతో గ్రామంతోపాటు ఆలయ పరిసరాలలో కోలాహలంగా మారాయి.

లింగాలలో ప్రత్యేక పూజలు



వత్సవాయి: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శైవాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. లింగాలలోని రామలింగేశ్వరస్వామి, మక్కపేట రామలింగేశ్వర, ద్వాదశజ్యోతిర్లింగ అయ్యప్ప ఆలయం, భీమవరంలోని కోనగిరి మల్లికార్జునస్వామి, ఇందుగపల్లిలోని శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయాలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. నదీ, మునేరులో స్నానమాచరించి పెద్దలకు పిండప్రదానం చేశారు. లింగాల మునేటి వద్ద భక్తుల కోసం జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. లింగాల, ఇందుగపల్లి, మక్కపేట, భీమవరం ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

నందీశ్వరులకు పూజలు



ముక్త్యాల(జగ్గయ్యపేట): మండలంలోని ముక్త్యాల గ్రామంలో మహాశివరాత్రి సందడి నెలకొంది. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నదిలో పుణ్యస్నానాలాచరించి పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. స్వయం పాకాలు అందజేసుకున్నారు. వీర్లకొలుపు పెట్టెలకు కృష్ణానది జలాలతో పూజలు చేశారు. ఆలయం వద్ద బాలత్రిపుర సుందరీ అమ్మవారి ట్రస్ట్ (కేసీపీ) ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. చిన్నారులు, పెద్దలు, పెద్దసంఖ్యలో భక్తులతో రోడ్లు కిక్కిరిసిపోయాయి.

బారులు తీరిన భక్తులు



పెనుగంచిప్రోలు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పెనుగంచిప్రోలు మండలంలోని శివాలయాలు బుధవారం శివనామస్మరణతో మార్మోగాయి. స్థానిక శ్రీస్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు మధ్యాహ్నం వరకు బారులుతీరి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపించారు. మునేరు పక్కన ఉన్న శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి, గ్రామంలోని అంబికేశ్వర స్వామి, నవాబుపేటలోని శ్రీఅన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, అనిగండ్లపాడులోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయాల్లో రుద్రాభిషేకాలు, పూజలు చేశారు.

ఇబ్బందులు పడిన చిన్నారులు



నందిగామరూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దాములూరు కూడలిలో సంగమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భారీసంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. భక్తుల క్యూలైన్ ఆలయం వెలుపల అర కిలోమీటరు వరకు ఉండటంతో మండుటెండల్లో క్యూలైన్‌లో నిల్చులేక చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఇబ్బందిపడ్డారు. టెంట్ సౌకర్యం కూడా కొద్దిదూరం వరకే ఉండటంతో ఎండ వేడిమిని తట్టుకోలేక భక్తులు ఇబ్బందిపడ్డారు. స్వామివారి దర్శనానికి రెండు నుంచి మూడు గంటల సమయం పట్టడంతో భక్తులకు అవస్థలు తప్పలేదు. కూడలికి రవాణా సదుపాయం అంతంతమాత్రంగా ఉండటంతో భక్తులు బైక్‌లు, ట్రాక్టర్లు, ఆటోలలో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణం సాగించాల్సి వచ్చింది.

హరహర మహాదేవ.. శంభో శంకర



ముక్త్యాలలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

ముక్త్యాల(జగ్గయ్యపేట): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ముక్త్యాలలోని భవానీ ముక్తేశ్వరాలయంతోపాటు ఆలయాలన్నీ బుధవారం శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ సమీపంలోని కృష్ణా నదిలో పుణ్య స్నానాలు చేసి ముక్తేశ్వరునికి అభిషేకాలు, కుంకుమ, బిళ్వార్చ పూజలు చేశారు. కృష్ణానది ఉత్తర వాహినిగా ప్రవహిస్తుండటంతో భక్తులు తరలివచ్చారు. దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. ఎండ తీవ్రంగా ఉండటంతో భక్తులు తీవ్రఇబ్బందులకు గురయ్యారు. నదిలో నీరు తక్కువగా ఉండటంతో అధికారులు జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. నదిలో పిండ ప్రదానాలతోపాటు వీర్ల కొలుపు, వీరభద్రుని సామగ్రికి కృష్ణమ్మ పవిత్ర జలంతో వారి ఆచారం ప్రకారం పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసు, రెవెన్యూ, పంచాయితీరాజ్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా నది వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. ఆలయ ఇన్‌ఛార్జ్ ఈవో కానూరి సురేష్ బాబు, ఎంపీడీవో నితిన్, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ మనోహర్, సీఐ. వెంకటేశ్వర్లు, చిల్లకల్లు, వత్సవాయి ఎస్సైలు తోట సూర్యశ్రీనివాస్, ఉమామహేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామకార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది ఘాట్ల వద్ద ప్రత్యేక విధులు నిర్వహించారు.

భక్తులకు పులిహోర పంపిణీ..

భక్తులకు ఆయా ఫ్యాక్టరీల యాజమాన్యాలు మంచినీటి ప్యాకెట్‌లు, పులిహోర పంపిణీ చేశాయి. కేసీపీ, రాజ్యలక్ష్మీ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కోహెన్స్ ఫార్మా లిమిటెడ్, భగవాన్ సత్యసాయి, ఆనంద సాయి నిలయం సంస్థలు అల్పాహారం, మంచినీటిని పంపిణీ చేశాయి.

ముక్తేశ్వరుని దర్శించుకున్న ప్రముఖులు..

కోటిలింగాలు, ముక్తేశ్వరస్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), విజయవాడ పోలీస్‌కమిషనర్ రాజశేఖర్‌బాబు దంపతులు, కేసీపీ సంస్థల జాయింట్ డైరెక్టర్ కవితాదత్, నందిగామ ఏసీపీ తిలక్, జగ్గయ్యపేట న్యాయమూర్తి శోభారాణి తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



ముక్త్యాల వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని జుజ్జూరులో వేంచేసియున్న సంగమేశ్వరస్వామిరి ఆలయాన్ని భక్తులు పెద్దసంఖ్యలో సందర్శించి పూజలు చేశారు. గిరి శిఖర రామలింగేశ్వరస్వామి, పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాల అనంతరం కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. నరసింహారావుపాలెంలోని బాల చాముండేశ్వరీ సహిత అమర లింగేశ్వరస్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల: శివరాత్రి పండగను పురస్కరించుకుని మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కంచికచర్ల, మున్నలూరు, కునికినపాడు, చెవిటికల్లు, కీసర, పెండ్యాల తదితర గ్రామాల్లోని శివాలయాలను భక్తులు సందర్శించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.



జుజ్జూరులో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు



ముక్త్యాలలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న కేసీపీ జాయింట్ డైరెక్టర్ కవితాదత్



మున్నలూరు ఆలయంలో భక్తులు

దాములూరు కూడలికి పోటెత్తిన భక్తులు

నందిగామరూరల్: హరహర మహాదేవ శంభో శంకర నామస్మరణతో.. జంగదేవరుల ఘంటానాదం.. కొమ్ముదేవరల బూరానాదం.. వేద పండితుల మంత్రోచ్చరణలు.. మంగళవాయిద్యాలతో దాములూరు కూడలి గ్రామంలో వేంచేసియున్న పర్వతవర్ధిని సమేత సంగమేశ్వర స్వామి ఆలయం ప్రతిధ్వనించింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం నందిగామ మండలంలోని గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి, సోమవరం సోమేశ్వర స్వామి, రాఘవాపురం రామలింగేశ్వర స్వామి, పల్లగిరి భవానీ శంకరస్వామి, కొత్రాయి గుట్ట మల్లేశ్వర స్వామి ఆలయాలతో పాటు కూడలి సంగమేశ్వరాలయం భక్తులతో పోటెత్తింది. ఆలయం వద్ద నిర్వహించిన కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

తెల్లవారుజాము నుంచే పుణ్య స్నానాలు..

రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైరాకట్టలేరులో పుణ్య స్నానాలాచరించి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. మహాశివరాత్రికి వైరా సంగమంలో పిండ ప్రధానాలు చేస్తే కాశీలో చేసిన ఫలం వస్తుందనే నానుడి ఉండటంతో భక్తులు తమ పితృదేవతలకు పిండ ప్రధానాలు చేశారు. వీర్ల పెట్టెలకు నదీస్నానం, పూజలు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్‌ఐ అభిమన్యు ట్రాఫిక్, క్యూలైన్‌ల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. దేవాదాయ శాఖాధికారులు పవన్ కళ్యాణ్, నరసింహమూర్తి భక్తులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేశారు.

భారీ అన్నదానం..

సంగమేశ్వరాలయం ఆధ్వర్యంలో దాతల సహకారంతో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పలు స్వచ్ఛంధ సంస్థలు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశాయి వైద్యారోగ్య శాఖ, ఆర్ఎంపీల సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. స్వచ్ఛంధ సంస్థలు, కేవీఆర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు భక్తులకు సేవలందించారు.



ప్రత్యేకాలంకరణలో దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి

నందిగామ పట్టణంలో..

పట్టణంలోని శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి, జ్ఞానసందీశ్వర స్వామి వారి ఆలయాలలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామలింగేశ్వర స్వామి వారిని పలురకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

కాంద్రపాడులో..

చందర్లపాడు మండలం కాంద్రపాడులో వేంచేసియున్న మహా పంచముఖేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి తెల్లవారుజామునే పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



భక్తులతో కిక్కిరిసిన నందిగామలోని రామలింగేశ్వర ఆలయం



జల్లు స్నానాలు చేస్తున్న భక్తులు



ముక్తేశ్వరుడి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



వైరా సంగమం వద్ద కొమ్ముదేవర బూరనాదం



దాములూరు కూడలిలో మహిళల కోలాట నృత్య ప్రదర్శన

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేడు

నందిగామటౌన్(నందిగామ రూరల్): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం జరుగనున్న పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నందిగామ ఆర్డీవో కార్యాలయం వద్ద ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, సిరా తదితర సామాగ్రిని బుధవారం ఎన్నికల సిబ్బందికి అందజేశారు. అనంతరం పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో బస్సుల్లో ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.

నందిగామ నియోజకవర్గంలో..

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నందిగామ నియోజకవర్గంలో మొత్తం 9,052మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నందిగామ మండలానికి సంబంధించి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆర్డీవో బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు విధులు నిర్వహించాలన్నారు. ఏసీపీ తిలక్ పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని సీఐ వైవీఎల్ నాయుడు తెలిపారు.



నందిగామలో ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ కె.బాలకృష్ణ

జగ్గయ్యపేట నియోజకవర్గంలో..

జగ్గయ్యపేట: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని మొత్తం7367మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. జగ్గయ్యపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మొత్తం ఆరు పోలింగ్ కేంద్రాలు, పెనుగంచిప్రోలు, వత్సవాయి జెడ్పీ పాఠశాలల్లో రెండేసి చొప్పున మొత్తం పది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగనుంది. పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ తెలిపారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వత్సవాయి మండలంలో 1482మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ కె.ప్రభుకుమార్ బుధవారం తెలిపారు.వీరిలో పురుష ఓటర్లు 956మంది, మహిళా ఓటర్లు 526 మంది ఉన్నట్లు వివరించారు. ఓటర్ల కోసం వత్సవాయి జెడ్పీ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



నందిగామ నుంచి ఎన్నికల సామగ్రితో తరలివెళ్తున్న పోలింగ్ సిబ్బంది



నందిగామ పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

కిటకిటలాడిన కోటిలింగాల

జగ్గయ్యపేట: శివరాత్రి పండుగ సందర్భంగా ముక్త్యాల గ్రామసమీపంలోని కోటిలింగ హరిహర మహాక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పంచముఖ అమృతలింగేశ్వరునికి తెల్లవారు జాము నుంచే అర్చకులు పలు ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో హరిదుర్గ నాగేశ్వరరావు, శివరాత్రి ఉత్సవాల ప్రత్యేకాధికారి ఎమ్.కె.టి.యన్ వరప్రసాద్, అర్చకులు తేజ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా కె.అగ్రహారం గ్రామంలోని పాలేటి ఒడ్డున వేంచేసి ఉన్న ఓంకారేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కోటిలింగాల్లో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

20 మద్యం సీసాలు స్వాధీనం


నందిగామరూరల్: మద్యం అక్రమ విక్రయాలు జరిపితే సహించేది లేదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బంగార్రాజు హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని దాములూరు కూడలి గ్రామ పరిధిలో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో జరుగుతున్న మహా శివరాత్రి ఉత్సవాలలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వడ్డిబోయిన మోహనరావు, కనగాల రత్తయ్యలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ యుగందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.


మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే : ఎంసీపీఐ

వించిపేట(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రజలకు హామీలు ఇచ్చి మోసం చేయడం అలవాటేనని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి విమర్శించారు. వించిపేటలోని కమ్యూనిటీ హాలులో ఎంసీపీఐ విజయవాడ నగర 2వ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చి నిలువునా మోసం చేశారని ఆరోపించారు. ఏటా రైతులకు రూ. 20వేలు ఇస్తానని, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు, తల్లికి వందనం పేరుతో ఏడాదికి రూ.18వేలు ఇస్తానని హామీలు ఇచ్చి 8నెలలు గడుస్తున్నా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పేదలకు అర్బన్‌లో రెండు సెంట్లు, రూరల్‌లో 3 సెంట్లు స్థలంలో ఇల్లు కట్టించి ఇస్తానని పేదలకు అబద్ధాల హామీలు గుప్పించారన్నారు. రాష్ట్రంలో పత్తి, మిర్చి ధరలు గణనీయంగా తగ్గిపోయాయని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాన్నారు. గ్రామాలు, పట్టణాలలో బెల్టుషాపుల ద్వారా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన హామీల అమలుకు ఎంసీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని వివరించారు.



స.హ. చట్టం బోర్డులపై వివరాల నమోదు






ఆర్డీవో, మండల పరిషత్ కార్యాలయాల్లో స.హ చట్టం బోర్డులపై నమోదు చేసిన వివరాలు

సాక్షి ఎఫెక్ట్

నందిగామటౌన్(నందిగామ రూరల్): సమాచారహక్కు చట్టం అమలులో పలువురు అధికారులు వహిస్తున్న ఉదాసీనవైఖరిపై 'స.హ.చట్టంపై అధికారుల్లో చిన్న చూపు' శీర్షికన ఈనెల 25వతేదీన 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథానానికి ఆయాశాఖల అధికారులు స్పందించారు. నందిగామలోని ఆర్డీవో, మండల పరిషత్ కార్యాలయాలతోపాటు పలు కార్యాలయాల్లోని సమాచార హక్కు చట్టం బోర్డులపై సంబంధిత అధికారుల పేర్లు, హోదా, ఫోన్‌నంబర్ల వివరాలను నమోదు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. సమాచార హక్కు చట్టం అమలుకు 'సాక్షి' దినపత్రిక చేస్తున్న కృషిపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

భక్తులకు తప్పని ట్రాఫిక్ కష్టాలు



ముక్త్యాల(జగ్గయ్యపేట): మహాశివరాత్రి పండుగ సందర్భంగా ముక్త్యాలలో భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. భక్తులు తెల్లవారు జాము నుంచే వాహనాల్లో కృష్ణానది వద్దకు తరలివచ్చారు. పోలీసులు గ్రామంలోని పందుల ఫారం వద్ద వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలకు అరకిలోమీటరు దూరంలో పార్కింగ్ ఏర్పాటు చేయడంతో భక్తులు నడుచుకుంటూ ఆలయానికి చేరుకున్నారు. ఉదయం 10గంటల సమయంలో మూడు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు చెప్పడమే తప్ప చేసిందేమీ లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామివారి దర్శనానికి విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు రావడంతో అధికశాతం మంది పోలీసులు ఆయన సేవలోనే ఉండి ట్రాఫిక్‌కు గాలికొదిలేశారనే విమర్శలు భక్తుల నుంచి వినిపించాయి. అంబులెన్స్ సైతం కొద్దిసేపు ట్రాఫిక్‌లో ఆగిపోయింది. ఈ క్రమంలో అక్కడే ఉన్న నందిగామ ఏసీపీ తిలక్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.